
NH-65 పై ఘోర ప్రమాదం..

# ఐదుగురు మహిళలు ఒక ఆటో డ్రైవర్ మృతి






బుధవారం 12 ఆగస్టు 2026 పేజీలు : 8



## ఎస్ఐఆర్ ప్రక్రియలో మెదక్ జిల్లా

# 100 శాతం పూర్తి

మెదక్ నియోజక వర్గంలో 2,20,427 మంది ఓటర్లలో 201705 మంది వివరాల డిజిటలైజేషన్

నర్సాపూర్ నియోజకవర్గంలో 2,32714 మంది ఓటర్లలో 20,84,99 డిజిటలైజేషన్ పూర్తి

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మెదక్ జిల్లా ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ,ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం జూన్ 25వ తేదీన ప్రారంభమైందని తెలిపారు. తొలి దశలో జూన్ 25 నుంచి జూన్ 30వ తేదీ వరకు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.అనంతరం జూలై 1 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను - మిగతా3లో

## కొండాపూర్ గురుకులంలో

# విద్యార్థులకు భద్రత కరువు

జూనియర్లపై సీనియర్ల వేధింపులు..

వస్తువులు, పెట్టెలు పగులగొడుతున్నారనే ఆరోపణలు..

హాస్టల్‌లో పర్యవేక్షణ ఏది..? వార్డెన్, ప్రిన్సిపల్ తీరుపై విమర్శలు..

విద్యార్థుల భద్రతపై అధికారులు దృష్టి సారించాలంటున్న తల్లిదండ్రులు



కొండాపూర్ ప్రజా జ్యోతి

కొండాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, హాస్టల్‌లో విద్యార్థుల భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారి వస్తువులు, పెట్టెలను పగులగొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జూనియర్ విద్యార్థులపై సీనియర్ల ఆధిపత్యం, వేధింపులు కొనసాగుతున్నప్పటికీ - మిగతా3లో

# ఇళ్ల పేరుతో అనుమతులు.. వ్యాపారాలు మాత్రం కమర్షియల్!

మార్కాపూర్ నుండి గొల్లపల్లి ప్రధాన రహదారి వెంట పుట్టగొడుగుల్లా రేకుల షెడ్లు..

కమర్షియల్ విద్యుత్ మీటర్లు లేకుండానే వ్యాపారాలా?

వ్యవసాయ బోర్ల నీటిని వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారా?

అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం..




కొండాపూర్ ప్రజా జ్యోతి

మార్కాపూర్ గ్రామం నుంచి గొల్లపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి వెంట ఇళ్ల నిర్మాణం పేరుతో అనుమతులు తీసుకుని, వాటిని వ్యాపార కార్యకలాపాలకు - మిగతా3లో

# ఎస్ఐఆర్ ప్రక్రియలో మెదక్ జిల్లా 100 శాతం పూర్తి

-మొదటిపేజీ తరువాయి
సేకరించడంతో పాటు ఓటర్ల వివరాల పరిశీలన, ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టారని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, పరిశీలన, డిజిటలైజేషన్ ప్రక్రియను మెదక్ జిల్లాలో నూరు శాతం పూర్తి చేసినట్లు వెల్లడించారు. మెదక్ నియోజకవర్గంలో మొత్తం 2,20,427 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,01705 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేసినట్లు తెలిపారు. ఇది మొత్తం ఓటర్లలో 91.51 శాతంగా ఉందని పేర్కొన్నారు. మిగిలిన 18,722 మంది ఓటర్లను అన్‌కలెక్టబుల్‌గా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో 5431 మంది మరణించిన వారు, 3433 మంది డబుల్ ఎంట్రీలు ఉన్నవారు, 8948 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు,874 మంది ఆచూకీ లభించని వారు ఉన్నారని,36 అదర్స్ గా ఉన్నారని వెల్లడించారు. అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన వారి శాతం 8.49 శాతంగా ఉదన్నారు.

నర్సాపూర్ నియోజకవర్గంలో మొత్తం 232713 మంది ఓటర్లు ఉండగా, వారిలో 20,8499 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేసినట్లు తెలిపారు. ఇది మొత్తం ఓటర్లలో 89.59 శాతంగా ఉందని పేర్కొన్నారు. మిగిలిన 24,214 మంది ఓటర్లను అన్‌కలెక్టబుల్‌గా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో 7735 మంది మరణించిన వారు, 3414 మంది డబుల్ ఎంట్రీలు ఉన్నవారు, 12153 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, 634 మంది ఆచూకీ లభించని వారు ఉన్నారని వెల్లడించారు. 278 అదర్స్ గా అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన వారి శాతం 10.41 శాతంగా ఉందన్నారు. డిజిటలైజేషన్ పూర్తయిన వారి శాతం, వివిధ కారణాలతో అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన శాతం కలిపి మెదక్ ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులో సమర్థవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేసిన ఎన్నికల అధికారులు, ఈఆర్ఓ, ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలను జిల్లా కలెక్టర్ అభినందించారు.

## బృందావన్ కాలనీలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**దోలు వాయిద్యాల నడుమ బోనాల ఊరేగింపు.. ప్రత్యేక పూజలు, అన్నదానం**

**అందోల్, ఆగస్టు 11 (ప్రజాజ్యోతి):** అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలోని బృందావన్ వెంచర్స్ కాలనీలో మంగళవారం ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కాలనీ అధ్యక్షుడు అల్లే శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలను డోలు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాసులు, ఏడీ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు అల్లే మంజుల శ్రీకాంత్, మరి అరుణకుమారి, మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల ప్రవీణ్, కోరబోయిన నాగరాజు, ఎక్సైజ్ ఎస్ఐ సందీప్‌రెడ్డి తదితరులు హాజరై అమ్మవారికి



ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాలనీ తరపున అతిథులను శాలువాలతో సత్కరించారు. బోనాల సందర్భంగా భక్తులకు కాలనీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు, యువత, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. ఫోటో రైట్అప్: బృందావన్ కాలనీలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కాలనీ సభ్యులు.

## హెచ్ఐవీ పరీక్షలకు డిజిటల్ విధానం

**క్యూఆర్ కోడ్‌తో సులభంగా సేవలు పోస్టర్ విడుదల చేసిన మెదక్ జిల్లా కలెక్టర్**



**మెదక్ (ప్రజాజ్యోతి )** హెచ్ఐవీ (ఎయిడ్స్)పై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, అవసరమైన వారికి పరీక్షలు మరియు సేవలను మరింత సులభంగా అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో డిజిటల్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సమీపంలోని హెచ్ఐవీ పరీక్షా కేంద్రాలు, అందుబాటులో ఉన్న సేవలు తదితర వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది. హెచ్ఐవీపై అనుమానం ఉన్న వారు భయపడకుండా, గోప్యతకు భంగం కలగకుండా పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. హెచ్ఐవీని ముందుగా గుర్తించడం ద్వారా అవసరమైన వైద్య సేవలు, చికిత్సను సకాలంలో పొందే అవకాశం ఉంటుంది. ప్రజలు అపోహలకు గురికాకుండా హెచ్ఐవీ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని, అవసరమైన వారు సమీపంలోని ఐసీటీసీ/హెచ్ఐవీ పరీక్షా కేంద్రాలను సంప్రదించాలని కోరుతున్నారు. "హెచ్ఐవీపై అవగాహన -- సకాలంలో పరీక్ష -- ఆరోగ్యకరమైన సమాజం" అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. ఈ కార్యక్రమం లో డి ఎం హెచ్ ఓ డాక్టర్ గణేశ్వర్ గారు డాక్టర్ హరి ప్రసాద్ గారు ఐసిటిసి కౌన్సిలర్ ధనశ్రీ గారు, గోపి సుధాకర్, రవి పీఎంవో శంకర్ రాథోడ్, కాముని రాజేశ్వర్ , స్కోప్ ఎన్జీవో ఉప్పలయ్య. అనిల్ ,లింక్ వర్కర్ ప్రోగ్రాం మేనేజర్ లక్ష్మణ్ ,స్టాఫ్ నర్స్ సౌందర్య, అంజిరెడ్డి సిపిఎం శ్రీనివాస్ అకౌంటెంట్ రమేష్ పాల్గొన్నారు.

## బుర్దిపాడ్ పాఠశాలలో భక్తి వెల్లువ..

# అంగరంగ వైభవంగా బోనాల వేడుకలు



తెలంగాణ సంస్కృతి--సంప్రదాయాలకు అద్దం పట్టిన వేడుకలు

భక్తిశ్రద్ధలతో మహాకాళీ అమ్మవారికి బోనాల సమర్పణ

**జహీరాబాద్, ఆగస్టు 11 (ప్రజా జ్యోతి న్యూస్)** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల పరిధిలోని బుర్దిపాడ్ ప్రభుత్వ ప్రాథమి కోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గౌతమ్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీ మహాకాళీ అమ్మవారి ఆశీస్సులతో బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజల భాగస్వామ్యంతో వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య సాగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా మహిళలు సంప్రదాయ బద్ధంగా బోనాలను అలంకరించి మహాకాళీ అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు



నిర్వహించి అమ్మవారిని కొలుస్తూ భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం భక్తి వాతావరణంతో కళకళలాడింది. విద్యార్థు లకు బోనాల పండుగ విశిష్టతతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని ఉపాధ్యాయు లు వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయా లను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. వేడుకల్లో తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు సర్పంచ్ మల్లికార్జున్, తుకారామ్, దిలీప్, నవీన్ రాములు, రమేష్ యువతీ యువకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు బాలమణి, సుజిత్,మంజుల గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## 102 మహిళ గోత్రనామాలతో అమ్మవారికి ఓడిబియ్యం



**మెదక్ (ప్రజాజ్యోతి )** జై వాసవి జై జై వాసవి ఆషాఢ మాసం సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం మెదక్ నందు 102 గోత్రాల మహిళలచే అమ్మవారికి ఓడిబియ్యము సారె సమర్పించడం జరిగింది శ్రీ కోదండ రామాలయం నుంచి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ఓడిబియ్యం సమర్పించడం జరిగింది ఆలయ పూజారి గణేష్ పంతులుగారు 102 గోత్రాలచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెదక్ పట్టణ మహిళా విభాగ అధ్యక్షురాలు కొత్త పద్మ కోశాధికారి కొత్త సుమన పిఆర్ఓ బూర్ల స్వాతి మెదక్ జిల్లా అధ్యక్షురాలు రాగి వనజ అధిక సంఖ్యలో మహిళా సోదరీమణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# చింతా వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల ఫైర్

## అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా? చింతా కు సవాల్

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :** సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా స్పందించారు. జగ్గారెడ్డిపై విమర్శలు చేస్తే ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. తాము చేసిన ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు సవాల్ విసిరారు. 2017లో సంగారెడ్డిలో రాహుల్ గాంధీ సభ విజయవంతం కావడంతో కేసీఆర్, హరీష్ రావులు జగ్గారెడ్డిపై కక్ష పెంచుకున్నారని ఆయన చేసిన వ్యాఖ్యలకు చింతా ప్రభాకర్ కౌ ఇచ్చిన కౌంటర్ పై కాంగ్రెస్ నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతా ప్రభాకర్ కుటుంబానికి సంబంధించిన భూముల వ్యవహారంపై ప్రశ్నలు లేవనెత్తారు. సీలింగ్ భూమి రిజిస్ట్రేషన్, దళితుల భూములు, సదాశివపేటలో రోడ్ల కబ్జా, మాలకుంట కబ్జా తదితర అంశాలపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో మహిళా కౌన్సిలర్ల పట్ల వ్యవహరించిన తీరుపైనా ప్రశ్నించారు. సదాశివపేటలో ఎక్కడికి రమ్మన్నా మేము అక్కడికి వస్తాం.. బహిరంగ చర్చకు సిద్ధమా? అంటూ కాంగ్రెస్ నేతలు సవాల్ విసిరారు. ఇకపై బీఆర్ఎస్ నాయకుల అవినీతి చిట్టాను ఒక్కొక్కటిగా బయటపెడతామని హెచ్చరించారు. సంగారెడ్డి అభివృద్ధిపై సైతం చింతా ప్రభాకర్‌కు కాంగ్రెస్ నాయకులు సవాల్ విసిరారు. ఐఐటీ,



ఇంటింటికీ మంజీరా నీరు, సంగారెడ్డి--లింగంపల్లి నాలుగు లేన్ల రహదారి, ప్రభుత్వ పాలిటెక్నిక్, అగ్రికల్చర్, పీజీ కాలేజీల ఏర్పాటు, కరోనా సమయంలో ఆక్సిజన్ సిలిండర్ల అందజేత వంటి కార్యక్రమాలను జగ్గారెడ్డి చేపట్టారని తెలిపారు. సంగారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి జగ్గారెడ్డితోనే సాధ్యమైందన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా, గుర్తుకు వచ్చే పేరు జగ్గారెడ్డిదేనని వివరించారు. ప్రజల కష్టాలు తీర్చే నాయకుడు జగ్గారెడ్డి అని గుర్తు చేశారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మునిపల్లె సత్యనారాయణ, కూన సంతోష్, షఫీ హాఫీజ్, కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల పేరుతో అనుమతులు.. వ్యాపారాలు మాత్రం కమర్షియల్!

-మొదటిపేజీ తరువాయి

వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నివాస అవసరాల కోసం తీసుకున్న అనుమతులను వ్యాపార అవసరాలకు ఉపయోగిస్తున్నారనే ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రధాన రహదారి పక్కనే పుట్టగొడుగుల్లా రేకుల షెడ్లు వెలుస్తుండటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ షెడ్లకు సంబంధించి అనుమతులు ఉన్నాయా? ఏ ప్రయోజనం కోసం అనుమతులు తీసుకున్నారు? ప్రస్తుతం ఏ విధంగా వినియోగిస్తున్నారు? అనే విషయాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

**కమర్షియల్ మీటర్ లేకుండానే వ్యాపారాలా?**

వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న కొన్ని ప్రాంతాల్లో కమర్షియల్ విద్యుత్ మీటర్లు వినియోగిస్తున్నారా లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వ్యాపార అవసరాలకు విద్యుత్ వినియోగిస్తుంటే నిబంధనల ప్రకారం సరైన విద్యుత్ కనెక్షన్ ఉందా లేదా అన్నదానిపై విద్యుత్ శాఖ అధికారులు తనిఖీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జఅలాగే వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోర్ల నుంచి వ్యాపార కార్యకలాపాలకు నీటిని వినియోగిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వ్యవసాయ బోర్ల నీటిని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారా లేదా అన్నది సంబంధిత అధికారులు పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల కళ్లకు కనిపించవా?**

ప్రధాన రహదారి పక్కనే నిర్మాణాలు, రేకుల షెడ్లు, వ్యాపార కార్యకలాపాలు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు ఎందుకు తనిఖీలు నిర్వహించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఇళ్ల పేరుతో అనుమతులు తీసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారా? కమర్షియల్ విద్యుత్ మీటర్లు ఉన్నాయా? వ్యవసాయ బోర్ల నీటిని వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారా? రేకుల షెడ్లకు నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదు? చర్యలు తీసుకోవడానికి ఇంకెంత సమయం? ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపడతారా.. లేక ఇదే నిర్లక్ష్యం కొనసాగుతుందా అన్నది వేచి చూడాలి.

## అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ కార్యకర్తకు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి పరామర్శ





**మెదక్ (ప్రజాజ్యోతి )** మెదక్ మండలం మంబోజిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నర్సింలు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి. తిరుపతిరెడ్డి మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సింలు ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఎలాంటి కష్టాలు ఎదురైనా తమ సహకారం ఉంటుందని తిరుపతిరెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి. మాణిక్యం రెడ్డి, మహేంద్ర అండ్ మహేంద్ర మాజీ చైర్మన్ మదర్ మోహన్ రావు, మాజీ సర్పంచ్ ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ రాములు, కల్వకుంట సర్పంచ్ కొండల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గంజి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సర్పంచ్.....




ప్రజాజ్యోతి

**మెదక్ (ప్రజా జ్యోతి)** పెద్ద శంకరంపేట మండలం కట్టెల వెంకటాపురం గ్రామానికి చెందిన సర్పంచ్ ఎర్రోళ్ల విట్టల్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాడు ప్రజా జ్యోతి స్పందనకు ఇంతకుముందు గ్రామపంచాయతీ లేక బీసీ కమిటీ హాల్ లోనే గ్రామ సభలు గాని బాడీ మీటింగులు గాని బీసీ కమిటీ హాల్ లోనే కొనసాగుతుండే ప్రజా జ్యోతి స్పందనకు వెంటనే గ్రామపంచాయతీ నిర్మించడం జరిగింది గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

# ఘనంగా ఐఎన్‌హెచ్‌ఆర్‌పీసీ చైర్మన్ నవోదయ సిద్ధార్థ జన్మదిన వేడుకలు





**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి, ఆగస్టు 11:** ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఐఎన్‌హెచ్‌ఆర్‌పీసీ చైర్మన్ నవోదయ సిద్ధార్థ జన్మదిన వేడుకలను మంగళవారం సంస్థ కోఆర్డినేటర్ డాక్టర్ దిగ్గే బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నవోదయ సిద్ధార్థకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ దిగ్గే బాబు మాట్లాడుతూ..ప్రజా శ్రేయస్సు, మానవ హక్కుల పరిరక్షణ కోసం నవోదయ సిద్ధార్థ చేస్తున్న నిస్వార్థ సేవలు అభినందనీయమన్నారు. బాధితులకు అండగా నిలుస్తూ, వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతున్నారని కొనియాడారు. కామారెడ్డి జిల్లాకు చెందిన ఒక యువకుడు చేయని నేరానికి సుమారు 20 సంవత్సరాలుగా జైలు జీవితం గడిపిన ఓ



వ్యక్తిని న్యాయపరమైన పోరాటం ద్వారా వారం రోజుల్లోనే జైలు నుంచి బయటకు తీసుకురావడంలో నవోదయ సిద్ధార్థ కీలక పాత్ర పోషించారని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ బాధితులకు అన్యాయం జరిగినా 'నేనున్నాను' అంటూ వారికి అండగా నిలుస్తూ నిస్వార్థంగా సేవలందిస్తున్న నవోదయ సిద్ధార్థ మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సభ్యులు, నాయకులు, అభిమానులు పాల్గొని నవోదయ సిద్ధార్థకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర నాయకులు డాక్టర్ డి. ఓంప్రకాష్, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి యం. ఏ ఖైసర్, మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ రావు పాటిల్, బాధ్యులు జి, సురేష్ గౌడ్, కొఠారి నర్సింలు, సంతోష్, విశ్వనాథ్, అశోక్, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

# కొండాపూర్ గురుకులంలో విద్యార్థులకు భద్రత కరువు

-మొదటిపేజీ తరువాయి

వాటిని అరికట్టడంలో హాస్టల్ సిబ్బంది తగిన స్థాయిలో పర్యవేక్షణ చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థుల మధ్య చిన్నపాటి గొడవలు, వస్తువుల ధ్వంసం వంటి ఘటనలు చోటుచేసుకుంటే వాటిపై వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకోవాల్సిన బాధ్యత హాస్టల్ నిర్వాహకులపై ఉందని తల్లిదండ్రులు అంటున్నారు.

**వార్డెన్, ప్రిన్సిపల్ పర్యవేక్షణ ఎక్కడ?**

విద్యార్థులు హాస్టల్‌లో రాత్రింబవళ్లు ఉంటున్న నేపథ్యంలో వారి భద్రత, క్రమశిక్షణపై వార్డెన్, ప్రిన్సిపల్ నిరంతరం పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. అయితే సీనియర్ విద్యార్థుల వేధింపులపై ఫిర్యాదులు వస్తున్నా సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



జూనియర్లకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఎవరిది?
విద్యార్థుల వస్తువులు పగులగొడుతున్నా చర్యలు ఎందుకు లేవు?
హాస్టల్‌లో పర్యవేక్షణ వ్యవస్థ సక్రమంగా ఉందా?
అనే ప్రశ్నలు తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతున్నాయి.

భద్రత విషయంలో రాజీ వద్దు

గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తమ కుటుంబాలకు దూరంగా హాస్టల్‌లో ఉంటున్నందున వారి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావు ఉండకూడదని తల్లిదండ్రులు కోరుతున్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లను వేధిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల వస్తువులు ధ్వంసం చేయడం, బెదిరింపులు లేదా వేధింపులు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హాస్టల్‌లో పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థుల భద్రతే మొదటి ప్రాధాన్యత కావాలి.. అధికారులు ఇప్పటికైనా స్పందించి గురుకులంలో వాస్తవ పరిస్థితులపై ప్రత్యేక తనిఖీ నిర్వహిస్తారా? అనేది వేచి చూడాలి.

## వైభవంగా పోచమ్మ తల్లి బోనాల పండుగ





**జహీరాబాద్, ఆగస్టు 11 (ప్రజా జ్యోతి న్యూస్)** ఝరసంఘం మండల కేంద్రంలో వైభవంగా నిర్వహించిన పోచమ్మ తల్లి బోనాల పండుగ లో శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ... బోనాల పండుగ మన ఐకమత్యానికి, ఆధ్యాత్మిక చింతనకు ప్రతీక అని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ బోనాల పండుగను కులమతాలకు అతీతంగా ప్రజలంతా ఐకమత్యంతో, సుఖసంతోషాలతో జరుపుకోవాలని, అమ్మవారి ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు సమృద్ధిగా పండి రైతులు సంతోషంగా ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యా లతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే మాణిక్ రావు గారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొగ్గల సంగమేశ్వర్, మాజీ సర్పంచ్ ఫోరం అధ్యక్షులు జగదీశ్వర్, గ్రామ సర్పంచ్ వినోద్ బాల్ రాజ్, పట్టణ అధ్యక్షులు ఎజాస్ బాబా, వివిధ గ్రామాల సర్పంచులు నాగేందర్ పటేల్, శివమణి, సోహెల్, మండల నాయకులు వెంకట్ రెడ్డి, శశివర్ధన్ రెడ్డి, ఉప సర్పంచ్ అనిల్, వార్డు మెంబర్లు ప్రవీణ్, సంగమేశ్వర్, నాయకులు లక్ష్మీకాంత్, ఉల్లాస్, తౌఫీక్, ఖదీర్, నర్సింలు, దత్తు, వీరన్న, రవికుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రాయదుర్గంలో డ్రగ్స్ పట్టివేత

**హైదరాబాద్ :** ఎస్ఓటీ నార్సింగి టీమ్, రాయదుర్గం పోలీసులు సంయుక్తంగా కలిసి చేసిన ఆపరేషన్ లో మధురానగర్ లోని పోచమ్మ ఆలయం సమీపం లో ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు. బిహార్ కు చెందిన 23 ఏళ్ల కృష్ణ కుమార్ ను అదుపులోకి తీసుకోని 2.8 కిలోల ఎండు గంజాయి మరియు 6 గ్రాముల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మరియు హెరాయిన్ విలువ సుమారు రెండున్నర లక్షలు గా తెలిపారు. కృష్ణ కుమార్ హౌస్కీపింగ్ సూపర్వైజర్ గా పనిచేస్తు డ్రగ్స్ దందా నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. కృష్ణ కుమార్ వద్ద గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన బిహార్కు చెందిన కార్మికులు రోషన్, అభిషేక్ కుమార్లను సైతం పోలీసులు అదుపులోకు తీసుకుననారు. రోషన్, అభిషేక్ లకు యూరిన్ పరీక్షల్లో డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారించారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ప్రధాన నిందితులు బంటి కుమార్, అమర్ కుమార్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

# లక్ష మంది తో సంగారెడ్డిలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి సీఎం బహిరంగ సభ ఏర్పాట్లపై సెక్రటేరియట్ లో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమీక్ష

సమీక్ష సమావేశం లో పాల్గొన్న సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్, నారాయణ్ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి



**కొండాపూర్ ప్రజా జ్యోతి ప్రతినిధి** ఈనెల 15న సంగారెడ్డిలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లపై సచివాలయంలోని తన ఛాంబర్‌లో నీటిపారుదల, పౌర సరఫరా శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నత స్థాయి రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, మంత్రి దామోదర రాజనర్సింహ వైరల్ ఫీవర్‌తో బాధపడుతుండటం వల్ల ఈ సమావేశానికి హాజరుకాలేకపోయారు.

ఈ సందర్భంగా సభకు భారీ జన సమీకరణ, వేదిక ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి సంగారెడ్డికి చేరుకుంటారని, సాయంత్రం 4 గంటల వరకు సంగారెడ్డి లో ఉంటారని నేతలు వెల్లడించారు.

సీఎం సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని, జన సమీకరణ, భద్రత, ఇతర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్, జగ్గారెడ్డి అధికారులకు సూచించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాల నుండి నియోజకవర్గానికి ఒకరు చొప్పున, మొత్తం పది మంది లబ్ధిదారులకు సీఎం రేవంత్ రెడ్డి సభా వేదికపైనే స్వయంగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తారని మంత్రి తెలిపారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు సూచించారు. సుమారు లక్ష మంది జనంతో ఈ భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

## జహీరాబాద్ మీదుగా బుల్లెట్ రైలు మార్గాన్ని కొనసాగించాలి

### -రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరిన ఎంపీ సురేష్ షెట్కార్



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 11:** హైదరాబాద్, ముంబై అధిక వేగ రైలు మార్గాన్ని తొలుత ప్రతిపాదించిన విధంగానే సంగారెడ్డి,జహీరాబాద్,షోలాపూర్ మీదుగా కొనసాగించాలని కోరుతూ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇటీవల బుల్లెట్ రైలు మార్గాన్ని తాండూర్, వికారాబాద్ మీదుగా మళ్లించేందుకు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు తెరపైకి వస్తున్న నేపథ్యంలో జహీరాబాద్ ప్రాంత ప్రజల్లో ఆందోళన నెలకొందని ఎంపీ సురేష్ షెట్కార్ రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జాతీయ అధిక వేగ రైలు సంస్థ రూపొందించిన ప్రాథమిక సమగ్ర ప్రాజెక్టు నివేదికలో ప్రతిపాదించిన జహీరాబాద్ మార్గాన్నే కొనసాగించాలని ఆయన కోరారు. జహీరాబాద్ మీదుగా బుల్లెట్ రైలు రాకతో ఈ ప్రాంతంలో పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని వివరించారు. ముఖ్యంగా జాతీయ పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చెందుతున్న జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ నగరానికి అధిక వేగ రైలు అనుసంధానం ఎంతో కీలకమని పేర్కొన్నారు. అలాగే, తొలుత రూపొందించిన ప్రాజెక్టు నివేదికలోని సాంకేతిక అంశాల ప్రకారం జహీరాబాద్ మీదుగా వెళ్లే అసలు మార్గం ద్వారా నిర్మాణ వ్యయం తక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఈ మార్గంలో భౌగోళిక పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో పాటు, ప్రత్యామ్నాయ మార్గాల కారణంగా తలెత్తే భూసేకరణ సమస్యలు, స్థానిక ప్రజల అభ్యంతరాలను కూడా నివారించవచ్చని వివరించారు. జహీరాబాద్ ప్రాంతం సమగ్రంగా అభివృద్ధి చెందేందుకు బుల్లెట్ రైలు అనుసంధానం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రాంతీయ సమాన ఆర్థికాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని జహీరాబాద్ మార్గాన్ని యథాతథంగా కొనసాగించేలా వ్యక్తిగత హామీ ఇవ్వాలని ఆయన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు.

## మండల సర్వసభ్య సమావేశం



**రాయికోడ్ ఆగస్టు 11 (ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య పాల్గొన్నారు. సమావేశంలో వ్యవసాయం, విద్య, వైద్యం, పౌరసరఫరాలు, అంగన్వాడీలు, ఉపాధి హామీ,తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర శాఖల పనితీరుపై సమీక్షించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరిం చాలని అధికారులకు సూచించారు. ఏఎంసి చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో షరీఫ్, ఎంఏఓ సారిక,వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు తదితరులు హాజరయ్యారు

## సిర్గాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు వేగవంతం.

రూ.200 కోట్లతో.. విద్యా విప్లవం!

వాలుతండాలో వేగంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులు.





**కల్హేర్, ఆగస్టు 11 (ప్రజాజ్యోతి):** సిర్గాపూర్ మండలం వాలుతండా వద్ద నిర్మిస్తున్న యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ సముదాయం నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు కోసం 25 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.200 కోట్లను వెచ్చిస్తోంది. అత్యాధునిక విద్యా సౌకర్యాలతో నిర్మిస్తున్న ఈ సముదాయంలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యను అందించనున్నారు. సుమారు 2,500 మంది విద్యార్థులకు వసతి, విద్యా సౌకర్యాలు కల్పించేలా ప్రాజెక్టును రూపొందిస్తున్నారు. నిర్మాణ పనుల్లో భాగంగా భవనాల డిజైన్లు, పనుల పురోగతి, నిర్మాణ నాణ్యత తదితర అంశాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులు సంబంధిత కాంట్రాక్టర్లకు సూచనలు చేస్తున్నారు.

## 16న నారాయణఖేడ్‌లో టీయూడబ్ల్యూజే సమావేశం

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 11:**



ఈనెల 16న నారాయణఖేడ్ పట్టణంలో టీయూడబ్ల్యూజే, ఐజేయూ నియోజకవర్గ కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు సంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు సయ్యద్ ఆసిఫ్ మంగళవారం తెలిపారు. ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ.. సమావేశంలో నూతన కమిటీ ఎన్నికతో పాటు జర్నలిస్టుల సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. టీయూడబ్ల్యూజే నియోజకవర్గ సభ్యులు తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఆరు దశాబ్దాల చరిత్రకు సాక్షిగా నిలిచిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్హేర్.



పురాతన భవనం పరిరక్షణకు పూర్వ విద్యార్థులు, స్థానికుల విజ్ఞప్తి పైకప్పు రేకులు మార్చి భవనాన్ని కాపాడాలని డిమాండ్



**కల్హేర్. 11.ఆగస్టు. ప్రజా జ్యోతి** స్వాతంత్ర్యానంతరం నారాయణఖేడ్ నియోజకవర్గంలో విద్యా ప్రగతికి బాటలు వేసిన పురాతన విద్యాసంస్థల్లో కల్హేర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒకటిగా నిలిచింది. దశాబ్దాలుగా వేలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన ఈ పాఠశాల ఎందరో ఉన్నత స్థానాల్లో నిలిచేందుకు పునాదిగా మారింది. అయితే ప్రస్తుతం పాఠశాల ఆవరణ, పురాతన భవనం పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో దాని పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు, పూర్వ విద్యార్థులు కోరుతున్నారు.

**ఎందరో ఉన్నత స్థానాలకు ఎదిగిన విద్యార్థులు**

ఈ పాఠశాలలో చదువుకున్న పలువురు విద్యార్థులు నేడు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో వివిధ ఉన్నత పదవుల్లో కొనసాగుతున్నారని స్థానికులు తెలిపారు. ఇస్రో, పర్యావరణ, వ్యవసాయ రంగాలతో పాటు వైద్యులు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా వివిధ ప్రభుత్వ పదవుల్లో పనిచేస్తున్నవారు ఈ పాఠశాల పూర్వ విద్యార్థులుగా ఉన్నారని పేర్కొన్నారు. పలువురు విద్యార్థులు ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లి తమ ప్రతిభను చాటుతున్నారని తెలిపారు. మాజీ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు మహారెడ్డి వెంకటరెడ్డి కూడా ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేసినట్లు స్థానికులు గుర్తుచేస్తున్నారు. ఆనాటి స్థానిక సర్పంచ్ కీర్తిశేషులు శెట్టి రామ్ శెట్టి ఆధ్వర్యంలో ఈ ఉన్నతమైన కల్హేర్ పాఠశాల భవనాన్ని నిర్మించడం జరిగింది. ఈ విద్యాసంస్థ ఎందరో ప్రముఖుల జీవితాలకు పునాది వేసిందని పూర్వ విద్యార్థులు పేర్కొంటున్నారు..

# దీర్ఘకాలిక నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

**-డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**



నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 11: నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజల దీర్ఘకాలిక నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా మంగళవారం సెక్రటేరియట్‌లో కీలక సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలంగాణ రాష్ట్ర శాసనసభ హామీల అమలు కమిటీ చైర్మన్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. సెక్రటేరియట్‌లో రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాడ ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సమావేశంలో పాల్గొని నారాయణఖేడ్ నియోజకవర్గానికి సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి సమస్యలు, నీటిపారుదల వసతుల అభివృద్ధి, పెండింగ్ పనులపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సాగునీరు, తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని, అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పెండింగ్ పనుల పురోగతిని సమీక్షించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తో పాటు సంబంధిత శాఖల జిల్లా అధికారులు సమావేశంలో పాల్గొని నియోజకవర్గంలోని నీటి సమస్యలు, వివిధ ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, చేపట్టాల్సిన అభివృద్ధి చర్యలకు సంబంధించిన వివరాలను నాయకులకు వివరించారు. నారాయణఖేడ్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సాగునీరు, తాగునీటి వసతులను మెరుగుపరిచి, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. నారాయణఖేడ్ ప్రజల నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని అన్నారు.

## ఎస్సై చైతన్య కిరణ్‌కు ఎస్పీ అభినందనలు

**రాయికోడ్ ఆగస్టు 11 (ప్రజాజ్యోతి):** మండలంలో రహదారి ప్రమాదాల నియంత్రణకు,ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చేపట్టిన చర్యలకు గుర్తింపుగా ఎస్సై చైతన్య కిరణ్‌ను సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ అభినందించారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్సైకి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.రహదారి భద్రతపై మరింత విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఎస్పీ సూచించారు.




## ఘనంగా గొల్లపల్లి సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు..



**కొండాపూర్ ప్రజా జ్యోతి** కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామంలో సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, యువకులు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీనివాస్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు పంచుకుంటూ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. శ్రీనివాస్ గౌడ్ గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. శ్రీనివాస్ గౌడ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని కోరుకున్నారు. జన్మదిన వేడుకలతో గొల్లపల్లి గ్రామంలో సందడి నెలకొంది.

## పాఠశాలల అభివృద్ధి నిధులపై ఆడిట్



**రాయికోడ్ ఆగస్టు 11 (ప్రజా జ్యోతి ):** మండలంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం విడుదలైన నిధుల వినియోగంపై అధికారులు ఆడిట్ నిర్వహించారు. పాఠశాలల అభివృద్ధికి సంబంధించిన నిధులు సక్రమంగా వినియోగించారా? చేపట్టిన పనులు నిబంధనల ప్రకారం జరిగాయా? అనే అంశాలపై అధికారులు పరిశీలన చేపట్టారు.ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులను పాఠశాలల అభివృద్ధికి నిజాయితీగా వినియోగించారా లేదా అనే అంశంపై ఆడిట్ బృందం వివరాలను పరిశీలించినట్లు సమాచారం. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల ఏర్పాటుతో పాటు నిధుల ఖర్చుకు సంబంధించిన రికార్డులను కూడా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రాథమిక,ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ నర్సిములు,కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమమే మా ప్రధాన ఎజెండా

## జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి






**70 సంవత్సరాల చరిత్ర కలిగిన యూనియన్:: రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైసల్**

**- పటాన్‌చెరులో టీయూడబ్ల్యూజే--ఐజేయూ సర్వసభ్య సమావేశం**

**- ఇంటి స్థలాలు, ఆరోగ్య కార్డులు, అక్రిడిటేషన్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**

**పటాన్ చెరు (ప్రజా జ్యోతి)** జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే--ఐజేయూ) పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం మంగళవారం రామచంద్రాపూర్‌లోని లక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, యూనియన్ బలోపేతం, సంక్షేమ కార్యక్రమాలపై నాయకులు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే యూనియన్ ప్రధాన ఎజెండా అని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. యూనియన్ బలోపేతానికి ప్రతి సభ్యుడు భాగస్వామి కావాలని, జర్నలిస్టుల సమస్యలపై సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న జర్నలిస్టులు అనేక సమస్యల మధ్య విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని, కుటుంబాలకు ఉపయోగపడే విధంగా ఆరోగ్య కార్డులు అందించాలని డిమాండ్ చేశారు.

అర్హత ఉన్నప్పటికీ ఇంకా అక్రిడిటేషన్ కార్డులు అందని జర్నలిస్టులు ఉన్నారని, వారందరికీ నిబంధనల మేరకు కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. చిన్న, మధ్య తరహా పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, ఫోటో జర్నలిస్టులు సహా అన్ని విభాగాల్లో పనిచేస్తున్న పాత్రికేయుల సమస్యలను సమానంగా పరిగణించాలని అభిప్రాయపడ్డారు.

జర్నలిస్టుల మధ్య ఐక్యత ఉంటేనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. యూనియన్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రతి జర్నలిస్టుకు అండగా నిలిచేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం విషయంలో సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. పైసల్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు యూనియన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఆరోగ్య కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టులు ఐక్యంగా ఉంటేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు ప్రతి ఒక్కరు సంఘం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో , జిల్లా కమిటీ నాయకులు, కార్యవర్గ సభ్యులు మాట్లాడి తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్ ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్, చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షుడు సిద్ధిక్ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చవాన్, కోశాధికారి లక్ష్మణ్ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరిఫ్, ప్రెస్‌క్లబ్‌ల అధ్యక్షులు హాజీ, మినాజ్ కార్యదర్శులు, సభ్యులు పాల్గొని జర్నలిస్టుల సమస్యలు, సంక్షేమంపై తమ సూచనలు చేశారు.

## రక్తసిక్తమైన జాతీయ రహదారి: నియంత్రణ కోల్పోయి డివైడర్ను దాటి దూసుకెళ్లిన కారు

**నాలుగు వాహనాలు ధ్వంసం.. ఇద్దరు దుర్మరణం!**



**జహీరాబాద్, ఆగస్టు 11(ప్రజా జ్యోతి న్యూస్)** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం వెంకటాపూర్ వద్ద జాతీయ రహదారి 65 పై ఈ రోజు సాయంత్రం అత్యంత ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అమాయకుల ప్రాణాలను బలితీసుకుంటూ హైవేపై మృత్యువు విలయతాండవం చేసింది. స్థానిక వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై అతివేగంతో ప్రయాణిస్తున్న ఒక కారు హఠాత్తుగా నియంత్రణ కోల్పోయింది. రోడ్డుపై వేగంగా దూసుకెళ్తూ ఒక్కసారిగా డివైడర్ను బలంగా ఢీకొట్టి, దానిపై నుంచి అవతలి వైపు ఉన్న రోడ్డుపైకి ఎగిరి పడింది. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న నాలుగు వాహనాలను ఈ కారు వరుసగా ఒకదానికొకటి అత్యంత బలంగా ఢీకొట్టింది. ప్రమాద ధాటికి వాహనాలన్నీ తీవ్రంగా ధ్వంసమై ముక్కలైపోయాయి. ఈ ఘోర ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మిగిలిన వాహనాల్లో ప్రయాణిస్తున్న పలువురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు

## తెలంగాణ స్వచ ఆటో, రిక్షా కార్మికుల ధర్నా

**హైదరాబాద్** స్వచ్ఛ ఆటో, రిక్షా కార్మికులు మంగళవారం నాడు మాదాపూర్ లోని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ను ముట్టడించారు. దాదాపు వెయ్యిమంది కార్మికులు సిఎంసి కార్యాలయం ముట్టడించారు. పోలీసులు వారిని ప్రధాన గేటు వద్ద అడ్డుకున్నారు. కార్మికులు రాంకీ గో బ్యాక్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. సిఎంసి కమిషనర్ నిర్ణయాలు తమపొట్టకొట్టె విధంగా ఉన్నాయని... తమను యదా స్థితిలో కొనసాగించాలని డిమాండ్ చేసారు.

## చేయూత పింఛన్‌ను అర్హులు సద్వినియోగం చేసుకోవాలి

**-- నారాయణఖేడ్ 12వ వార్డు కౌన్సిలర్ షారుక్ ఖాన్**



నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 11: ప్రభుత్వం ప్రతిపాదించిన చేయూత పింఛన్లలో కొత్తగా ప్రాధాన్యత కల్పిస్తున్న వర్గాలకు చెందిన అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ షారుక్ ఖాన్ అన్నారు. ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ..వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, ఈత కల్లు గీతకారులు, చేనేతకారులు, పైలేరియా, డయాలసిస్ బాధితులకు చేయూత పింఛన్ల ద్వారా ప్రయోజనం కల్పించే ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, గీతకారులు, చేనేతకారులు, పైలేరియా, డయాలసిస్ బాధితులకు నెలకు రూ. 2,016, వికలాంగులకు రూ. 4,016 పింఛన్ అందించే అవకాశం ఉందన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వితంతువులు, కనీసం ఏడాది నుంచి ఒంటరిగా జీవిస్తున్న మహిళలు, 50 సంవత్సరాలు పైబడిన గీతకారులు, చేనేతకారులు, రెండో, మూడో దశ పైలేరియా బాధితులు, డయాలసిస్ చికిత్స పొందుతున్న వారు సంబంధిత ధ్రువపత్రాలతో అర్హతను నిర్ధారించుకోవాలని సూచించారు. వికలాంగులకు అంగవైకల్య ధ్రువపత్రం అవసరమని పేర్కొన్నారు. అర్హత పొందేందుకు తెలంగాణ రాష్ట్ర శాశ్వత నివాసిగా ఉండటంతో పాటు ఆధార్ అనుసంధానం, కుటుంబం, వయస్సు తదితర వివరాలు సక్రమంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగం లేదా పింఛన్ పొందుతున్న వారు, ఆదాయ పన్ను చెల్లించే వారు, నిర్దేశిత సామాజిక, ఆర్థిక ప్రమాణాలకు మించిన ఆస్తులు లేదా ఆదాయం కలిగిన వారు అర్హులు కాదని తెలిపారు. అర్హులైన వారు అవసరమైన ధ్రువపత్రాలతో సంబంధిత మున్సిపల్ కార్యాలయం, గ్రామపంచాయతీ లేదా మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన, ధ్రువీకరణ అనంతరం అర్హత ఉన్న వారికి పింఛన్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. చేయూత పింఛన్‌కు అర్హత ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తుల పరిశీలన నేటి నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. మున్సిపాలిటీ వార్డు అధికారులు ఇంటింటికీ వచ్చి దరఖాస్తుల పరిశీలన చేపట్టనున్నందున, అర్హులైన దరఖాస్తుదారులు అధికారులకు అవసరమైన సమాచారం, ధ్రువపత్రాలు అందించి సహకరించాలని కోరారు.

## ప్రాణహిత నీటిని వినియోగించేందుకు తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించాలి

**సుందిళ్ల బ్యారేజీపై డ్యామ్ సేఫ్టీ సంస్థ నిర్ణయమే కీలకం..**

**నిపుణులతో చర్చించి ప్రభుత్వానికి ప్రతిపాదన ఇవ్వాలి**

**హైదరాబాద్:** తెలంగాణలో సాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రాణహిత జలాలను వినియోగించుకోవడం అత్యంత కీలకమని, అందుకు తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం చేయడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని పలువురు నిపుణులు, సాగునీటి ఉద్యమకారులు అభిప్రాయపడ్డారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రాణహిత నుంచి నీటిని వినియోగించుకునే తాత్కాలిక, దీర్ఘకాలిక మార్గాలను ప్రభుత్వం పరిశీలించాలని కోరారు.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై భద్రతాపరమైన సమస్యలు ఉన్న నేపథ్యంలో, సంబంధిత డ్యామ్ సేఫ్టీ సంస్థలు ఇచ్చే సాంకేతిక నివేదికలు, నిర్ణయాలను ప్రభుత్వం తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. బ్యారేజీలను ఉపయోగించరాదని సాంకేతికంగా నిర్ణయించిన పరిస్థితుల్లో, సంబంధిత అధికారులైనా, మంత్రులైనా, ప్రభుత్వం అయినా స్వతంత్రంగా వాటిని వినియోగించడానికి నిర్ణయం తీసుకోకూడదని అన్నారు.బ్యారేజీలకు అవసరమైన మరమ్మతులు పూర్తయ్యాయని, భద్రతకు ఎలాంటి ప్రమాదం లేదని సంబంధిత నిపుణుల సంస్థలు స్పష్టంగా ధ్రువీకరించిన తర్వాత మాత్రమే వాటి వినియోగంపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

**ప్రాణహిత జలాలే ప్రత్యామ్నాయం**

మరోవైపు తెలంగాణలో నీటి అవసరాలను తీర్చగలిగే స్థాయిలో ప్రాణహిత నదిలో నీటి లభ్యత ఉందని, ఆ నీటిని వినియోగించుకోవడానికి తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం కీలకమని పేర్కొన్నారు.తుమ్మిడిహెట్టి నుంచి మైలారం వైపు ఇప్పటికే పెద్దమేరకు కాలువ నిర్మాణం పూర్తయిందని, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి, అవసరమైతే తాత్కాలికంగా మోటార్లు, పంపుల ద్వారా ప్రాణహిత నీటిని కాలువలోకి ఎత్తిపోసి వినియోగించుకునే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు.కాలువ వ్యవస్థను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి, భవిష్యత్తులో శాశ్వత పరిష్కారంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు.ఉమ్మడి ఆదిలాబాద్ అవసరాలకు తుమ్మిడిహెట్టి కీలకంఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, మంచిర్యాల తదితర ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలను ప్రస్తుత ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో తీర్చలేకపోతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ప్రాణహిత జలాలను వినియోగించుకోవడం ద్వారా ఈ ప్రాంతాలకు నీటి భద్రత కల్పించవచ్చని అన్నారు.తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో గతంలో జరిగిన ఆలస్యాన్ని ఇక కొనసాగించకుండా, ప్రభుత్వం తక్షణమే సాంకేతిక అధ్యయనం చేయించి నిర్మాణానికి సంబంధించిన స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## కొత్తగూడెం వీకే వర్క్‌షాప్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**– వీకే వర్క్‌షాప్ కార్మికులను కలిసిన నూతన ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి గట్టయ్య**

**కొత్తగూడెం :** కొత్తగూడెం ఏరియాలోని వీకే వర్క్‌షాప్‌ను నూతన ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి గట్టయ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్‌లోని అన్ని సెక్షన్ల కార్మికులు, పిట్ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వర్క్‌షాప్ హెచ్‌ఓడీ క్రిస్టోఫర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కార్మికుల సమస్యలపై చర్చించారు. వర్క్‌షాప్‌లో మ్యాన్‌పవర్ పెంపు, కార్మికులకు ప్లే డేలు, పీహెచ్‌డీలు పెంపు, క్యాంటీన్ హాల్ ఏర్పాటు, ఎలక్ట్రీషియన్లకు రైన్‌కోట్లు, ప్యాంట్, షర్ట్ అందజేత, ఈఓటీ యంత్రాలను త్వరగా సమకూర్చడం వంటి డిమాండ్లను ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా మహిళా కార్మికుల కోసం ప్రత్యేక రెస్ట్‌రూమ్, ఇండోర్ కార్మికులకు రెస్ట్‌రూమ్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికుల భద్రత, సౌకర్యాల విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని గట్టయ్య విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై వర్క్‌షాప్ హెచ్‌ఓడీ క్రిస్టోఫర్ సానుకూలంగా స్పందించారు. గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కార్యదర్శిగా ఎన్నికైన గట్టయ్యకు అభినందనలు తెలిపారు. వర్క్‌షాప్ సమస్యలపై ఇప్పటికే ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామని, త్వరలోనే సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. వర్క్‌షాప్ ఇంజినీర్లు డీవైఎస్‌ఈలు శంకర్, అనిల్‌కుమార్, ఉపేందర్‌బాబు గట్టయ్యను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అన్ని సెక్షన్లకు చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన బ్రాంచ్ కార్యదర్శికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి మధుకృష్ణ, కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ ఆఫీస్ బేరర్ గుమ్మడి వీరయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్ గుమ్మడి మురళి, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ మెంగని రోషన్, పిట్ కమిటీ సభ్యులు సిద్దిరాల రాజకుమారస్వామి, పీఆర్‌సీ రెడ్డి, నరేష్, ప్రభాకర్, పరశురాములు, కస్తూరి రమేష్, అనూష, వెంకటదుర్గ, వసంతిక, రమణ, సంధ్యారాణి, శ్రీమన్నారాయణ, సత్యనారాయణ, ఈశ్వర్, మహేష్, యాకుబుద్దీన్, టీఆర్‌ఎస్ రాజు, రాజయ్య, బొజ్జ వెంకటస్వామి, అత్తహర్ పాషా, దుర్గ, హరీష్, సామ్యూల్ సుధాకర్, గోపాల్, వెంకట్, ఐఎస్ చిరంజీవి, సమ్మయ్య, తుమ్మల శ్రీనివాస్, మురళి, రమేష్, బాబాదిన్, కిరణ్, సలిగంటి శ్రీనివాస్, సముద్రాల శ్రీనివాస్, రహీం పాషా, ప్రకాష్, ప్రవీణ్, ప్రభాకర్, ట్రేడ్ అప్రెంటిస్‌లు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి నివరణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నోడల్ పర్సన్ లతో సమీక్ష

**మహబూబాబాద్ :** కుష్టు వ్యాధి నివరణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నోడల్ పర్సన్ లతో సమీక్ష సమావేశం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ కుష్టు వ్యాధి రహిత మహబూబాబాద్ జిల్లాను ముందంజలో ఉంచాలని, జిల్లాలో గల కుష్టి వ్యాధిగ్రస్తులకు79 మందికి చికిత్స మరియు మందులు అందించడం జరుగుతుంది. కుష్టు వ్యాధి లక్షణాలు మొద్దు బారిన మచ్చ రాగి రంగులో ఉంటాయని, స్పర్శ లేకుండా ఉంటుందని, మచ్చ పైన వెంట్రుకలు రావడం, మచ్చ పైన చెమట రాకుండా ఉండడం, పొడిబారిన మచ్చ శరీరంపై ఈ లక్షణాలు గల మచ్చలు ఉన్నట్లయితే అనుమానితులుగా భావించి దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి పరీక్ష కొరకై పంపించవలసిందిగా అవగాహన కల్పిస్తూ, ఉచితంగా మందులు అందజేయబడతాయని తెలియజేస్తూ, కుష్టు వ్యాధి రహిత జిల్లా చెయ్యాలని ఈ సందర్భంగా నోడల్ పర్సన్ లకు, సూపర్వైజర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో కుష్టు వ్యాధి పోగ్రామ్ అధికారి డాక్టర్ అర్జున్ గారు, డీపీఎంవోలు సతీష్ రెడ్డి, వాలియా, డిప్యూటి డెమో రాజకుమార్ మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర కుష్టు వ్యాధి నోడల్ పర్సన్లు పాల్గొన్నారు.

## సొంత ఖర్చులతో జిల్లా లైబ్రరీకి 30 వేల పుస్తకాలు వితరణ చేసిన చైర్మన్

**భావితరాల విజ్ఞానం కోసం పుస్తకాన్ని మించిన సాధనం లేదు**

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి**

**మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి, జిల్లా గ్రంథాలయ పాఠకులు పోటీ పరీక్షల సంబంధించిన పుస్తకాలు పాఠకుల సౌకర్యార్థం కోసం ప్రతి చదువరికి పుస్తకం ఉండాలని తలంపుతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి తన సొంత ఖర్చులతో 30 వేల రూపాయల కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సంబంధించిన గ్రూప్ వన్, గ్రూప్ టు ,ఎస్సై , కానిస్టేబుల్స్ ,బ్యాంకు, జూనియర్ లైన్ మెన్, అట్లాస్ ఇండియన్ పాలిటి, తెలంగాణ చరిత్ర ,భారత చరిత్ర , ఇంకా అనేక పుస్తకాలు, జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వితరణ చేశారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మనకు తెలియని ప్రపంచాన్ని మనకు చూపించి మన నడవడిక ఆలోచనలు సన్మార్గంలో పయనించడానికి భావితరల విజ్ఞానం కోసం పుస్తకానికి మించిన సాధనం ఏది లేదని , కాబట్టి ప్రతి పాఠకుడు ఈ కాంపిటీటివ్ పుస్తకాలను వినియోగించుకొని పోటీ పరీక్షల్లో విజేతలై తల్లిదండ్రుల ఆశయాలు నెరవేరుస్తూ, సమాజాభివృద్ధికి దోహదపడాలని కోరారు.అనంతరం గ్రంథాలయ పాఠకులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఔదార్యానికి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు ,జి విజేందర్ ,రుద్రారపు వీరేందర్, మరియు నరసింగం శ్రీనివాస్, మందుల రఘు,భూలక్ష్మి యాదమ్మ గ్రంథాలయ పాఠకులు గోపాల్ ,నవీన్,సురేష్ ప్రవల్లిక ,జ్యోతి , శారద తదితరులు పాల్గొన్నారు.

## NH-65 పై ఘోర ప్రమాదం.. ఐదుగురు మహిళలు ఒక ఆటో డ్రైవర్ మృతి



**జహీరాబాద్, ఆగస్టు 11 (ప్రజా జ్యోతి న్యూస్)** నియోజకవర్గ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామ శివారులోని చీఎ–65 జాతీయ రహదారి పై మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోను ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న 10 మంది మహిళల్లో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఐదుగురు మహిళలు ఒక ఆటో డ్రైవర్ మరో నలుగురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. వారికి చికిత్స నిమిత్తం బీదర్ హాస్పిటల్ తరలించారు. మృతులు, క్షతగాత్రులను కర్ణాటక రాష్ట్రం లోని రాజగిరా గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఆలయ వార్షికోత్సవం బోనాల పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్ రావు



**జహీరాబాద్, ఆగస్టు 11(ప్రజా జ్యోతి న్యూస్)** పట్టణంలోని మొగుడంపల్లి చౌరస్తా వద్ద గల మహంకాళి ఆలయ వార్షికోత్సవం మరియు బోనాల పండుగ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో జహీరాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు మాజి ఆత్మ చైర్మన్ విజయ్ కుమార్, ఉ మాజీ కేతకీ సంగమేశ్వర ఆలయ చైర్మన్ నీలా వెంకటేశం పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, భక్తులు, స్థానిక ప్రజలతో కలిసి బోనాల పండుగ వేడుకల్లో పాల్గొని, ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రతిఇంటా ఆయురారోగ్యాలు, సుఖశాంతులు ఐశ్వర్యాలు వెల్లివిరియాలని ఎమ్మెల్యే మాణిక్ రావు ఆకాంక్షించారు.